రాగం: ముఖారి

తాళం: ఆది (ఖండ గతి)

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
ఇదిగాక వైభవంబిక నొకటి కలదా

౧. అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్షలిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై ఇదె చూడ
సతత విజ్ఞానవాసనవోలె నుండె

౨. తరుణి హృదయము కృతార్థత బొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది ఇంతలో
పరలేక మనసు నిశ్చలభావమాయ

౩. శ్రీవేంకటేశ్వరుని జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాబట్టె జెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై ఇపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ